క్లుప్తంగా

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయ సమీపంలో ఉన్న నిత్యాన్నదాన సంస్థ భవన నిర్మాణానికి ఆదివారం కోవెలకుంట్ల పట్టణానికి చెందిన పాణ్యం రాఘవేంద్రారెడ్డి, లీలావతమ్మ కుటుంబ సభ్యులు రూ.25,001 విరాళంగా అందజేశారు. ఈ మేరకు సంస్థ కమిటీ సభ్యులకు దాతలు నగదు ఇచ్చారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

డోన్ టౌన్ : కుల వివక్షను రూపుమాపేందుకు కృషి చేసిన జగద్గురు ఆది శంకరాచార్యులు, భగవత్ శ్రీరామనుజం జయంతిని పురష్కరించుకుని ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లో వీహెచ్‌పీ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం రాముల దేవాలయంలో తత్సంగం నిర్వహించారు. ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని పాటించాలని సంస్థ ప్రధాన కార్యదర్శి రామరాజేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, శివశంకర్, కార్యదర్శి నరేష్, ప్రముక్ శ్రీరామ్, భజరంగ్‌దళ్ సంపర్క్ కృష్ణారావు, దుర్గావాహిని విభాగ్ ప్రముక్ భవానీ, ఏబీవీపీ కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు శ్రీనివాసులు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ముదిగేడు, ఎగ్గోని, గిద్దలూరు, రెడ్డిపల్లె, ఆల్వకొండ, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, కానాల గ్రామాల ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

ఘనంగా మాతృదినోత్సవం



బ్రహ్మ కుమారి కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మాతృదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఓం శాంతి ప్రజాపిత బ్రహ్మకుమారి కేంద్రంలో మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని మృత్యమూర్తుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వారికి పాదాభి వందనం కార్యక్రమం నిర్వహించారు. భగవంతుడు సైతం మాతృమూర్తికి ప్రథమ స్థానం కల్పించారని ప్రజా పిత బ్రహ్మ కుమారి నిర్వాహకురాలు మాధవి, ఉషారాణి తెలిపారు. మన జన్మకు కారణమైన మాతృమూర్తులను వృద్ధాప్యంలో ప్రతిఒక్కరూ బాగా చూసుకోవాలని సూచించారు.

రోడ్డుకు అడ్డంగా... విద్యుత్ స్తంభం



సంజామల: కోవెలకుంట్ల–పేరుసోముల ప్రధాన రహదారిలో ఆల్వకొండ సమీపాన నాలుగురోజుల క్రితం కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభం కూలింది. రోడ్డుపై విద్యుత్ స్తంభం అడ్డంగా పడినా ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనచోదకులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఏదైనా ప్రమాదం జరగకపోకముందే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ఆకుమల్ల పోలింగ్ బూత్ చేరిన ఎన్నికల సిబ్బంది



కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



కొలిమిగుండ్ల పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన షామియానా



బనగానపల్లె పట్టణంలో 113 పోలింగ్ కేంద్రాన్ని మహిళా పోలింగ్ కేంద్రంగా ముస్తాబు చేసిన దృశ్యం

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది

బనగానపల్లె : సాధారణ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బనగానపల్లె నియోజకవర్గంలోని 277 పోలింగ్ కేంద్రాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎన్నికల అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య మేరకు పీఓ, ఏపీఓతో పాటు మొత్తం ఏడు మంది సిబ్బందిని అధికారులు నియమించారు. ప్రత్యేక వాహనాల్లో ఎన్నికల సిబ్బందిని మధ్యాహ్నం నుంచి తరలించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి కామేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాంతం నుంచి ఎన్నికల అధికారులు పోలింగ్ సామగ్రిని తీసుకున్నారు. వాటిని మరోసారి సరిచూసుకుని ప్రత్యేక వాహనాలో ఎన్నికల సిబ్బంది వెళ్లారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి వసతి, వైద్య సిబ్బంది, నడవలేని వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్ అందుబాటులో ఉంచారు. బనగానపల్లె నియోజకర్గంలో మొత్తం 2,41,179 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఎన్నికల అధికారి కామేశ్వరావు తెలిపారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కోవెలకుంట్ల మండలంలో 45 పోలింగ్ కేంద్రాలు ఉండగా 39,564 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 20,563 మంది మహిళలు, 18, 997 మంది పురుషులు, నలుగురు ఇతర ఓటర్లు ఉన్నారు. కోవెలకుంట్ల పట్టణంలో 21 పోలింగ్‌లు ఉండగా 19వేల మంది ఓటర్లు ఓటు వినియోగించుకోనున్నారు.

సంజామల: మండల కేంద్రం సంజామలతోపాటు గ్రామాలలో 39 పోలింగ్ బూత్‌లు సిద్ధం చేసినట్లు తహసీల్దార్ రత్నకుమారి తెలిపారు. మండలంలో మెత్తం ఓటర్లు 32,196 ఉండగా పురుషులు 15911, మహిళలు 16280, ఇతరులు 05 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరుకు పోలింగ్ జరుగుతుందని, ప్రతి ఓటరు ఓటు హక్కును వినయోగించుకోవాలని సూచించారు.

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బనగానపల్లె మండలంలో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. కొండపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 113వ పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. పట్టణంలోని కస్బా ఎంపీపీ పాఠశాల 97వ పోలింగ్ కేంద్రాన్ని సాధరణ మోడల్ పోలింగ్ కేంద్రంగా ఎన్నికల అధికారులు ముస్తాబు చేశారు.



ఎన్నికల డ్యూటీల నియామకంలో రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు



బనగానపల్లె 97వ పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేక మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన దృశ్యం



అవుకు జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో షామియానా ఏర్పాటు చేసిన దృశ్యం

అవుకు: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలిపారు. అవుకు మండలంలో మొత్తం 42572 మంది ఓటర్లు ఉండగా 21,131 మంది పురుషులు, 21,436 స్త్రీలు, ఇతరులు ఐదు మంది ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం 50 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అనుగుణంగా వసతులు కల్పించామని చెప్పారు.

కొలిమిగుండ్ల: సాధరణ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొలిమిగుండ్ల మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలున్నాయి. అన్ని చోట్ల ఓటర్ల కోసం షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

డోన్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈవీఎంలను భద్రపరచిన స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, తదితర సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. డోన్ నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలల్లో మొత్తం 2,22,077 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,10,133, స్త్రీలు 1,11,864 మంది ఉండగా ఇతరులు 80 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అలాగే ప్రతి బూత్‌కు పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, ఓపీలు ఇద్దరు, మైక్రో అబ్జర్వర్ తోపాటు ఇతర సిబ్బంది కలిపి దాదాపు 10 మంది చొప్పున మొత్తం 3వేల మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. డోన్ నియోజకవర్గంలోని 291 పోలింగ్ కేంద్రాలు, 32 మొబైల్ పార్టీలకు గాను 496 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



డోన్‌లో సుందరంగా అలంకరించిన ఆదర్శ మహిళా పోలింగ్ బూత్

నాలుగు మోడల్ కేంద్రాలు

డోన్ నియోజకవర్గంలో మొత్తం నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశారు. డోన్ పట్టణంలోని కేవీఎస్‌కాలనీలో (104) కేంద్రాన్ని ఆదర్శ మహిళా బూత్‌గా, మల్లెంపల్లె గ్రామంలోని (66)ను యూత్ బూత్‌గా, కోత్తకోటలో ఆదర్శ బూత్‌గా, ప్యాపిలి మండలం నేరుడుచెర్ల గ్రామంలోని (187)ను విభిన్న ప్రతిభావంతుల మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఓటర్లకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించి అందంగా ముస్తాబు చేశారు.



పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

ప్యాపిలి: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ప్యాపిలి మండలంలోని మొత్తం 81 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో అధికారులు చేరుకున్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పండుగ వాతావరణం తలపించేలా స్వాగత తోరణాలు, బెలూన్లు, పూలదండలు, అరటిమొక్కలతో పోలింగ్ కేంద్రాన్ని అలంకరించారు. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఆర్‌వో ప్రతాప్ రెడ్డి తెలిపారు.

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు. మండలంలోని 86 పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యంతోపాటు దివ్యాంగులకు అనుగుణంగా ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 67,929 ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ జీవన్ చంద్ర శేఖర్ తెలిపారు. పురుషులు 33,431, స్త్రీలు 34,482, ఇతరులు 16 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.



బేతంచెర్ల వెటర్నరీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



ప్యాపిలి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం

ఆది శంకరాచార్యుల జయంతి

డోన్ టౌన్ : ఆది శంకరాచార్యుల జయంతి పురష్కరించుకొని స్థానిక శ్రీకేదారేశ్వరస్వామి దేవాలయంలో(గాయిత్రీ పీఠం) వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టోత్తర పుష్పార్చన, మహా నైవేద్యం, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం శతవధాని గండ్లూరి దత్తాత్రేశర్మ శంకర్ భగవత్పాదుల జీవితం, హైందవ సనాతన, సమాజంలో బ్రాహ్మణుల ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు శర్మ, నంద్యాల శంకరశర్మ, కళ్లె శేషావలి శర్మ, చంద్రశేఖర్‌శర్మ, సుబ్రహ్మణ్యం శర్మ తదితరులు పాల్గొన్నారు.





తత్సాంగం నిర్వహిస్తున్న దత్తాత్రేయశర్మ, వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

వెంకటేశ్వరస్వామి దేవాలయంలో : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రామానుజ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి వారికి తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం గోష్టి ఆధ్వర్యంలో పురవీధుల గుండా ఉత్సవం నిర్వహించి అష్టోత్తర శతనామావలి మహా నివేధన, తీర్థ ప్రసాత వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీకాంత్‌శర్మ, ఆలయ ధర్మకర్త పాతాళం సుబ్బారావు దంపతులు, గోష్టి సభ్యుల పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు గిరిజనుల మద్దతు

నంద్యాల టౌన్: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, గిరిజనుల కుటుంబాలకు ఆర్థికంగా, విద్యా, వైద్య, రాజకీయంగా అండగా నిలిచి గిరిజనులకు నామినేటెడ్ పదవులు కల్పించిన ప్రభుత్వ పునఃస్థాపనే లక్ష్యంగా కృషి చేస్తామని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో గిరిజన ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో గిరిజనులకు ప్రభుత్వంలో వివిధ ఉన్నత స్థాయి పదువులు ఇచ్చి సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. గిరిజనులకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసి, మైదాన ప్రాంతానికి చెందిన గిరిజన నేతలకు కమిషన్ మెంబర్, టీటీడీ బోర్డు మెంబర్,శ్రీశైలం బోర్డు మెంబర్,ఒక ఎమ్మెల్సీ తోపాటు అనేక నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలలో కూడా రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. 500 జనాభా కలిగిన 105 గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. అలాగే అటవీ, రెవెన్యూ భూములు సాగు చేసుకుంటున్న 1,50,055 కుటుంబాలకు 3,26,862 ఎకరాలను గిరిజన లబ్ధిదారులకు పంపిణీ చేశారన్నారు. జీపీఎస్ రాష్ట్ర హోయ కార్యదర్శి రవి నాయక్, ఎస్టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాముడు, బంజారా ధర్మసేన రాజారాం నాయక్, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ శంకర్ నాయక్, ఉశేనమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు నాయక్

తిమ్మాపురం... అభివృద్ధి బాట

- కొత్త పంచాయతీలో రూ.1.45 కోట్లతో అభివృద్ధి పనులు
- గ్రామానికి చేకూరిన మౌలిక వసతులు.. మారిన రూపురేఖలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కొత్తగా నిర్మించిన తారురోడ్డు

డోన్ రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యతన్విడంతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మండలంలో తిమ్మాపురం గ్రామం కొత్త పంచాయతీగా ఏర్పాటు అయ్యింది. ఈ మేరకు మౌలిక వసతులు చేకూరడంతో ఆ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పాటు కావడంతో రోడ్లు, మురుగు కాల్వలు, వాటర్ ట్యాంక్, సీసీ రోడ్ల నిర్మాణాలతో గ్రామం కళకళలాడుతుంది. ఈ గ్రామాన్ని గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం తిమ్మాపురం గ్రామం సైతం అభివృద్ధిలో మిన్నగా నిలిచింది. రూ.1.45కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ఈ గ్రామంలో 1200 మంది జనాభా ఉండగా 250 కుటుంబాలు, 750 ఓటర్లు ఉన్నారు.

గతంలో పడరానిపాట్లు...

గతంలో కనీస వసతులు కరువై ప్రజలు పడరానిపాట్లు పడ్డారు. ప్రత్యేకించి రహదారులు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలం రోడ్లు బురద గుంటలను తలపించే పరిస్థితి. మురుగునీటి నిల్వల మూలంగా దుర్వాసన వెదజల్లేది. ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీలు కళకళలాడుతున్నాయి. అదేవిధంగా పొలం రహదారులు సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దిగుబడులు తెచ్చుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. ప్రస్తుతం పొలాలకు గ్రావెల్ రోడ్లు ఏర్పాటు చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మనబడి నాడునేడు పథకంతో ప్రాథమిక పాఠశాల ప్రైవేట్ స్కూల్‌ను తలపిస్తుంది. మౌలిక వసతులు చేకూరడంతో తిమ్మాపురం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కళకళలాడుతున్న ప్రభుత్వ పాఠశాల

తిమ్మాపురంలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ.40 లక్షలతో ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంక్ నిర్మాణం
- రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 15 లక్షలతో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు
- రూ.10 లక్షలతో గ్రావెల్ రోడ్డు
- రూ.18 లక్షలతో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- రూ.50లక్షలతో తారురోడ్డు



రూ.40లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్



గ్రామం నుంచి పొలాలకు వేసిన గ్రావెల్ రోడ్డు



కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

చాలా సంతోషంగా ఉంది...



పొలాలకు వెళ్లేందుకు రహదారి సరిగాలేక ఇబ్బందులు పడ్డాం. పొలాలకు రస్తాలకు ప్రాధాన్యత నిస్తూ గ్రావెల్ రోడ్డు వేశారు. ఇప్పుడు దిగుబడులను సాఫీగా ఇంటికి తెచ్చుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. గ్రామంలోనూ సీసీ రోడ్లు నిర్మించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం అవుతున్నాయి. ప్రభుత్వ సాయం మరువం.

– రమేష్, తిమ్మాపురం గ్రామం.

అధికారుల చొరువతోనే మా గ్రామం అభివృద్ధి...



అధికారులు ప్రత్యేక చొరవతోనే మా గ్రామం అభివృద్ధి చెందింది. గతంలో రోడ్లు సరిగా లేక చాలా ఇబ్బంది పడ్డాం. వర్షాకాలంలో మరీ ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఆ సమస్య తీరింది. సీసీ రోడ్ల నిర్మాణం అభినందనీయం. అదేవిధంగా ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మించారు. సంక్షేమ పథకాలు సైతం అందరికీ అందుతున్నాయి. ప్రభుత్వ సాయం మరువం.

– మధు, తిమ్మాపురం గ్రామం.